ఇవేం రోడ్లు.. ఇదేం దుస్థితి

- వర్షాలకు ఛిద్రమవుతున్న దారులు
- బురదమయంగా మారిన అంతర్గత రోడ్లు
- కోతకు గురైన ప్రధాన రహదారులు


ప్రమాదకరంగా బూడిదవాగు బ్రిడ్జి


ఇటీవల కురిసిన వర్షాలకు తహసీల్దార్ కార్యాలయ సమీపంలోని రోడ్డు దుస్థితి..

కరకగూడెం: ఏజెన్సీ ప్రాంతమైన కరకగూడెం మండలంలో చిన్నపాటి వర్షానికే రోడ్లన్నీ ఛిద్రంగా మారుతున్నాయి. అధికారులు, పాలకుల నిర్లక్ష్యం వహిస్తున్నారని తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న స్థానికులు విమర్శిస్తున్నారు. మండలంలోని అనేక గ్రామాల్లో అంతర్గత రోడ్లు వర్షం పడగానే బురదమయంగా మారి ప్రయాణికులు, పాదచారులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయి. వాహనాలు బురదలో కూరుకుపోవడం, నడవడానికి కూడా వీలు లేకుండా తయారైంది.

ప్రమాదకరంగా బ్రిడ్జిలు

ఇటీవల వర్షాలకు సమత్ భట్టుపల్లి బ్రిడ్జి వద్ద ప్రధాన రహదారి కోతకు గురైంది. వర్షపు నీటి ఉధృతికి రోడ్డు కొంత కొట్టుకుపోవడంతో ఆ ప్రాంతంలో ప్రయాణించడం అత్యంత ప్రమాదకరంగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలకు బూడిదవాగు ఉధృతంగా ప్రవహించి వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. రానున్న రోజుల్లో భారీ వర్షాలు కురిస్తే బ్రిడ్జితో పెను ప్రమాదం పొంచిఉన్నట్లే. పద్మాపురం గ్రామ సమీపాన బుగ్గ చెరువు అలుగు వరదతో చప్టాకు అనుకోని ఉన్న ప్రధాన రహదారి కూడా కోతకు గురైంది. అల్లేరు గూడెం బ్రిడ్జికి ఇరువైపులా ప్రధాన రహదారిపై గుంతలు ఏర్పడి ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇంకొన్ని చోట్ల కోతకు గురైన రహదారులు కూడా ఇప్పటివరకు మరమ్మతులకు గురయ్యాయి.

పట్టింపులేని అధికారులు

బ్రిడ్జిల వద్ద రహదారులు, అంతర్గత దారులు ప్రమాదకరంగా మారినా పట్టించుకున్న అధికారి లేడు. కోతకు గురైన రహదారులకు మరమ్మతులు చేపట్టేందుకు ఏ మాత్రం ముందుకు రావడం లేదు. కొన్ని రోజుల క్రితం వర్షాలకు దెబ్బతిన్న రహదారిని ఎవరూ పట్టించుకోవడంతో కొలూరు గ్రామస్తులు సొంతంగా రహదారిని బాగుచేసుకున్నారు. అధికారుల నిర్లక్ష్యానికి ఈ ఉదంతం తార్కాణం. రోడ్ల సమస్యలను అధికారులు, పాలకులు గుర్తించి.. తక్షణమే రహదారుల మరమ్మతులు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

- గుంతలతో కమలాపురం రోడ్డు
- ఏళ్లు గడుస్తున్నా పూర్చని వైనం
- పట్టించుకోని అధికారులు


రోడ్డుపై ప్రమాదకరంగా ఉన్న గుంత

మణుగూరురూరల్: మున్సిపాలిటీ పరిధిలోని కమలాపురం, చినరాయిగూడెం గ్రామాలకు వెళ్లాలంటే పెద్ద సాహసమనే చెప్పాలి. గతంలో మండలంలో కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్ నుంచి ఆయా గ్రామాలకు వెళ్లాలంటే ప్రజలు ఆపసోపాలు పడేవారు. వారు పడుతున్న ఇబ్బందులపై ప్రజలు అనేక విజ్ఞప్తులు చేయడం, పత్రికలలో కథనాల రావడంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో నాటి ఎమ్మెల్యే రేగా కాంతారావు స్పందించి అంబేద్కర్ సెంటర్ పూజారినగర్ నుంచి వయా చినరాయిగూడెం మీదుగా పాములపల్లి వరకు బీటి రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపారు. పూజారి నగర్ నుంచి కట్టుమల్లారం వరకు రోడ్డును నిర్మించారు. దీంతో కట్టుమల్లారం వరకు గల రాకపోకలు సాఫీగా సాగుతున్నప్పటికీ.. కట్టుమల్లారం నుంచి కమలాపురం, చినరాయిగూడెం వెళ్లే ప్రజలు, వాహనదారులు నరకయాతన పడుతున్నారు. కట్టుమల్లారం నుండి చినరాయిగూడెం వరకు మార్గమధ్యలో ఏర్పడిన పెద్ద పెద్ద గోతులు ప్రమాదకరంగా మారాయి. అసలే అంతంత మాత్రంగా ఉన్న రోడ్డు ఇసుక లారీల రాకపోకలతో మరింత అధ్వానంగా తయారవుతోంది. దీంతో ఈ మార్గం గుండా ప్రయాణించాలంటేనే ప్రజలు బెంబేలెత్తుతున్నారు.

ప్రమాదకరంగా రాత్రి పయాణం

పగటి సమయాల్లో ప్రయాణించడమే గగనంగా మారిన ఆ మార్గంలో ఇక రాత్రైతే ప్రయాణించే వారి పరిస్థితి వర్ణనాతీతం. మార్గంలో విద్యుత్ లైట్లు లేకపోవడంతో వాహనదారులు, ప్రయాణికులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణిస్తుంటారు. వర్షాకాలమైనందున ఈ రహదారిలో ఏర్పడిన గుంతల్లో నీరు నిలిచి కుంటలను తలపిస్తున్నాయి. మరికొన్ని గుంతలు చిన్నపాటి చెరువులుగా దర్శనమిస్తున్నాయి. కట్టుమల్లారం ప్రభుత్వ పాఠశాలకు సమీపంలో ఉన్న గుంతలైతే నీరు చేరి బురద ఊబిగా మారి కనీసం ప్రయాణించేందుకు సైతం వీలు లేకుండా ఉంది.

పట్టించుకోని అధికార యంత్రాంగం..


అధ్వానంగా దర్శనమిస్తున్న కమలాపురం రహదారి

కమలాపురం రోడ్డు ఇంతా అధ్వానంగా మారినా సంబంధిత అధికారులు మాత్రం ఏమాత్రం పట్టించుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. ఎన్నిసార్లు విన్నవించినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పేర్కొంటున్నారు. ఎన్నికల్లో అది చేస్తాం, ఇది చేస్తాం.. గ్రామాలను అభివృద్ధి చేస్తామని చెప్పిన నాయకులు, పాలకులు.. గుంతల రోడ్డుతో తాము అగచాట్లు పడుతున్నా కన్నెత్తి కూడా చూడడం లేదని వాపోతున్నారు. ఏళ్లకు ఏళ్లు గడిచిపోతున్నాయే కానీ.. తమ జీవనాల్లో అభివృద్ధి కానరావడం లేదని గ్రామస్తులు అంటున్నారు. ఇప్పటికైనా సమస్యలు పరిష్కరించాలి.

ఎవరూ పట్టించుకోవడం లేదు..



మండలంలో పలు చోట్ల రోడ్లు ఎంత దారుణంగా ఉన్నాయో మాటల్లో చెప్పలేం. ముఖ్యంగా సమత్ భట్టుపల్లి బ్రిడ్జి వద్ద ప్రమాదం పొంచి ఉంది. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు. పాలకులకు మా కష్టాలు కనిపించడం లేదా? ప్రాణాలు పోతేగానీ పట్టించుకునే పరిస్థితి నెలకొంది. తక్షణమే రోడ్లకు మరమ్మతులు చేయించి, మా ప్రయాణాలను సురక్షితం చేయాలని కోరుతున్నాం.

– బుగ్గల రాజేందర్, సమత్ భట్టుపల్లి

బయటకు వస్తే భయం



రోడ్ల పరిస్థితి చూస్తే కడుపు తరుక్కుపోతోంది. వర్షం పడిందంటే చాలు.. ఇంటి నుంచి బయట అడుగు పెట్టాలంటేనే భయమేస్తోంది. బురదలో నడవలేక, పిల్లల్ని బడికి పంపలేక..ఆస్పత్రికి వెళ్లాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వెళ్తున్నాం. అధికారులు మాత్రం ఏమాత్రం పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. దయచేసి మాకు మంచి రోడ్లు వేయించండి. దెబ్బతిన్న రోడ్లను తక్షణమే మరమ్మతులు చేయండి.

– మెస్ రజిత, అల్లేరుగూడెం

గుంతలతో అవస్థ పడుతున్నాం..

కట్టుమల్లారం నుంచి కమలాపురం వరకు గల గుంతలతో అవస్థలు పడుతున్నాం. సంవత్సరాలు గడుస్తున్నాయే కానీ రోడ్డు మాత్రం బాగుపడడం లేదు. ఆటోలో, బైకులపై ప్రయాణించాలంటే నరకయాతన పడుతున్నాం. అధికారులు, పాలకులు స్పందించి వెంటనే రోడ్డు నిర్మించాలి.

– హరి, కమలాపురం

రోడ్డు నిర్మించాలి..

కట్టుమల్లారం నుంచి చినరాయిగూడెం వెళ్లాలంటే అతికష్టం మీద ప్రయాణించాల్సి వస్తోంది. రహదారి మార్గంలో ఏర్పడిన పెద్ద పెద్ద గుంతలతో భయాందోళన చెందుతున్నాం. సంబంధిత అధికారులు స్పందించి త్వరగా రోడ్డు నిర్మిస్తే ఇబ్బందులు తొలగుతాయి.

– నాగేశ్వరరావు, చినరాయిగూడెం

క్లుప్తంగా

నేడు కొత్త రేషన్ కార్డుల పంపిణీ

భద్రాచలంటౌన్: భద్రాచలం తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం కొత్తగా మంజూరైన వారికి రేషన్ కార్డుల పంపిణీ చేయనున్నట్లు ఇన్‌చార్జ్ తహసీల్దార్ దనియాల వెంకటేశ్వర్లు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. సాయంత్రం నాలుగు గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావ్ హాజరై కార్డులను పంపిణీ చేస్తారని పేర్కొన్నారు. కొత్తగా రేషన్ కార్డు మంజూరైన లబ్ధిదారులతో పాటు కొత్తగా పేర్లు చేర్చిన వారు తహసీల్దార్ కార్యాలయంలో జరిగే కార్డుల పంపిణీ కార్యక్రమానికి హాజరై కొత్తగా వచ్చిన కార్డును పొందవల్సిందిగా కోరారు.

సర్వే పరిశీలన

మణుగూరురూరల్: సింగరేణి మణుగూరు ఓసీ విస్తరణలో భాగంగా మండలంలోని తిర్లాపురం గ్రామంలో నిర్వహిస్తున్న ఎంజైమెంట్ సర్వేను మణుగూరు తహసీల్దార్ అద్దంకి నరేష్ సోమవారం సందర్శించి పరిశీలించారు. సర్వేలో అధికారులు సేకరిస్తున్న వివరాల రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్వేలో అర్హులైన నిర్వాసితులందరికీ పూర్తి వివరాలను సేకరించి నమోదు చేయాలన్నారు. అర్హుల వివరాల నమోదులో తప్పులు దొర్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నిర్వాసితులు కూడా తగిన ధృవపత్రాలను సిద్ధం చేసుకుని సర్వేకు సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ గోపి, సర్వే అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

'పోడు'కు పట్టాలివ్వాలి


పీఓకు వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎంపీ బాబూరావు

ములకలపల్లి: సాగులో ఉన్న పోడు భూములన్నిటికీ పట్టాలివ్వాలని మాజీ ఎంపీ మిడియం బాబూరావు అన్నారు. ఈ మేరకు ములకలపల్లి మండల పోడు సాగుదారులతో కలిసి సోమవారం భద్రాచలం ఐటీడీఏ పీఓ రాహుల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్నోఏళ్లుగా పోడు సాగు చేస్తున్నా.. సర్వే కాలేదనే కారణంలో వ్యవసాయాన్ని అడ్డుకోవడం సరికాదని అన్నారు. అటవీశాఖ అధికారులు ఉద్దేశపూర్వకంగా పోడు సేద్యాన్ని నిలిపివేసే కుటిల యత్నాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఉన్నతాధికారులు దృష్టి సారించి, పోడు రైతులకు న్యాయం చేయాలని అభ్యర్థించారు. తెలంగాణా ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కారం పుల్లయ్య, రైతు సంఘం నాయకులు ఊకంటి రవికుమార్, పోడు రైతులు బూరం నాగబాబు, సిద్దిని రమణ, సోమయ్య, నాగమ్మ, స్వరూప ఉన్నారు.

వ్యాధులను కట్టడి చేయాలి

భద్రాచలంటౌన్: భద్రాచలం డివిజన్ పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో మలేరియా, డెంగీ, టైఫాయిడ్ వంటి వ్యాధులు ప్రబలకుండా వైద్యాధికారులు కట్టడి చేయాలని ఐటీడీఏ అదనపు వైద్యాధికారి సైదులు సూచించారు. అదనపు వైద్యాధికారి కార్యాలయంలో డివిజన్ పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పర్యవేక్షకులతో సోమవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మలేరియా, డెంగీ ఎక్కువగా రావడానికి అవకాశం ఉన్న గ్రామాల్లో జ్వర సర్వే నిర్వహించి, దోమల స్ప్రేయింగ్ కచ్చితంగా చేయించాలని చెప్పారు. నెలవారి పీహెచ్‌సీలకు ఇచ్చిన లక్ష్యాలను తప్పకుండా అధిగామించాలని, ఏఎన్‌సీ నమోదు, హాస్పిటల్‌లో కాన్పులు, ఎన్‌సీడీ,టీబీ, వైద్య శిబిరాలు తప్పకుండా నిర్వహిస్తు వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ చైతన్య పాల్గొన్నారు.

మద్యం షాపునకు ఆమోదం

దుమ్ముగూడెం: మండలంలోని ములకపాడు పంచాయతీలో మద్యం షాపు నిర్వహణకు గాను సోమవారం నిర్వహించిన పెసా గ్రామ సభ ఆమోదం తెలిపింది. గ్రామపంచాయతీ ప్రత్యేకాధికారి ఎంపీడీఓ వివేక్‌రామ్ అధ్యక్షతన ఏ4 మద్యం దుకాణాల అనుమతుల కోసం జరిగిన పెసా గ్రామ సభలో 66 మంది ఓటర్లు పాల్గొనగా.. 66 మంది చేతులెత్తి అమోదం తెలియజేశారు. ఈ గ్రామసభలో పంచాయతీ కార్యదర్శి రాధకృష్ణ, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

దుమ్ముగూడెం: రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేయాలని, పీఆర్‌సీ నివేదికను ప్రకటించాలని డిమాండ్ చేస్తూ.. ఈ నెల 5న ధర్నా చేపట్టనున్నట్లు టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రాజు తెలిపారు. సోమవారం మండలంలోని ఆర్లగూడెం ఏహెచ్‌ఎస్ పాఠశాలలో భోజన విరామ సమయంలో ధర్నా సంబంధిత కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీలను వెంటనే అమలు చేయాలని, టీచర్ల సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి రవి, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ రామచంద్, ఏహెచ్‌ఎస్ ఆర్లగూడెం ఉపాధ్యాయ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మావోయిస్టులపై అప్రమత్తంగా ఉండాలి


సిబ్బందితో మాట్లాడుతున్న డీఎస్పీ రవీందర్ రెడ్డి

కరకగూడెం: మావోయిస్టు కార్యకలాపాలపై అప్రమత్తంగా ఉండాలని మణుగూరు డీఎస్పీ రవీందర్ రెడ్డి పోలీసులకు సూచించారు. ఈ మేరకు ఆయన సోమవారం వార్షిక తనిఖీలో భాగంగా కరకగూడెం పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా పలు రికార్డులు, లా అండ్ ఆర్డర్ రిజిస్టర్లు, కేసుల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అలాగే స్టేషన్‌లో ఉన్న ఆయుధాలను తనిఖీ చేసి, వాటి నిర్వహణపై సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. ముఖ్యంగా మావోయిస్టుల కార్యకలాపాల గురించి నిత్యం తెలుసుకుంటూ.. ముందుకు సాగాలని పేర్కొన్నారు. అనంతరం స్టేషన్ పరిసరాలను పరిశీలించి, పరిశుభ్రత విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. స్టేషన్ సిబ్బంది, టీజీఎస్పీ సిబ్బందితో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏడూళ్ల బయ్యారం సీఐ వెంకటేశ్వరరావు, కరకగూడెం ఎస్సై పీవీఎన్.రావు, సిబ్బంది పాల్గొన్నారు.

టీబీజీకేఎస్ నేతల పరామర్శ


బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న టీబీజీకేఎస్ నాయకులు

మణుగూరుటౌన్: ఏరియాలో ఓసీ–2లో ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తూ ఇటీవల ప్రమాదవశాత్తు రేగులగండి చెరువులో మృతి చెందిన సుంకరి శ్రీనివాస్ కుటుంబాన్ని టీబీజీకేఎస్ నాయకులు సోమవారం పరామర్శించారు. మంచిర్యాల జైపూర్‌లో నివాసం ఉంటున్న వారి కుటుంబ సభ్యులను కలిసి ధైర్యం చెప్పారు. డిపెండెంట్ ఉద్యోగాన్ని అందిపుచ్చుకుని ఆర్థికంగా బలోపేతం కావాలని సూచించారు. వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి వెంకటేశ్వర్లు, రాజేందర్, తిరుపతి, మధుకర్, మహేందర్‌లు ఉన్నారు.

టీబీపై క్యాంపెయిన్

దుమ్ముగూడెం: మండలంలోని పర్ణశాల ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం పరిధిలోని చిన్ననల్లబల్లి సబ్ సెంటర్‌లో టీబీ ముక్త్ భారత్ అభియాన్ క్యాంపెయిన్‌లో భాగంగా సోమవారం టీబీ ముక్త్ భారత్ క్యాంప్ నిర్వహించారు. ఈ క్యాంప్‌లో క్షయ వ్యాధి అనుమానితుల వద్ద నుంచి 51 మందికి ఎక్స్‌రేలు తీయగా.. 18 తెమడ శాంపిల్స్ సేకరించాడు. ఈ సందర్భంగా డాక్టర్ రేణుకా రెడ్డి మాట్లాడుతూ.. క్షయపైనా, ప్రభుత్వ చర్యలపైనా అవగాహన కల్పించారు. వైద్యసిబ్బంది వెంకట నర్సమ్మ, వెంకటేశ్వర్లు, రాజు, నాగేశ్వరరావు, భూలక్ష్మి, భాగ్యవతి, ఆశాలు అన్నపూర్ణ చెల్లమ్మ, కమల పాల్గొన్నారు.

ఎన్నికల్లో 'గులాబీ' సత్తా చాటాలి


సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు

మణుగూరురూరల్: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గులాబీ సత్తా చాటాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని గుట్టమల్లారంలో గల హనుమాన్ ఫంక్షన్‌హాల్‌లో బీఆర్ఎస్ పార్టీ పినపాక నియోజకవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రేగా కాంతారావు మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో అమలు చేసిన ప్రజాసంక్షేమ పథకాలను కార్యకర్తలు వివరిస్తూ పార్టీకి పూర్వవైభవాన్ని తీసుకొచ్చేందుకు కృషి చేయాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలుపొందేందుకు శ్రమించాలన్నారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు కుర్రి నాగేశ్వరరావు, మాజీ జెడ్పీటీసీ పోశం నర్సింహారావు, పట్టణ అధ్యక్షుడు కుంటా లక్ష్మణ్, నియోజకవర్గంలోని మండలాల నాయకులు కోలేటి భవాని శంకర్, పగడాల సతీష్‌రెడ్డి, కోడి అమరేందర్, రావుల సోమయ్య, దాట్ల వాసుబాబు, గుమ్మడి గాంధీ, తాళ్లపల్లి యాదగిరిగౌడ్, రామిరెడ్డి, వెన్న అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎరుకల ఎంప్లాయిస్ ఫెడరేషన్ కార్యదర్శిగా శ్రీనివాస్

ములకలపల్లి: ఎరుకల ఎంప్లాయిస్ ఫెడరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శిగా ములకలపల్లికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు గరికె శ్రీనివాస్ ఎంపికయ్యారు. హైదరాబాద్‌లో వలిగి ప్రభాకర్‌రావు అధ్యక్షతన నిర్వహించిన ఆలిండియా ఎరుకల హక్కుల పోరాట సమితి (వైహెచ్‌పీఎస్) 29వ ఆవిర్భావ దినోత్సవం వేడుకల్లో ఎంప్లాయిస్ యూనియన్ నూతన కమిటీని ప్రకటించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. సంఘ అభివృద్ధికి శక్తివంచనలేకుండా కృషి చేస్తానని అన్నారు.

స్థానిక పోరుకు సిద్ధం కావాలి

ములకలపల్లి: స్థానిక సంస్థల ఎన్నికల పోరుకు సిద్ధం కావాలని టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మోరంపూడి అప్పారావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మాజీ జెడ్పీటీసీ సున్నం నాగమణి, సీనియర్ నాయకుడు తాండ్ర రాంబాబులతో కలిసి మాదారం గ్రామంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల హామీల అమలులో పాలకపక్షం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. కాంగ్రెస్ వైఫల్యాలపై విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. సీనియర్ నాయకులు శనగపాటి సీతారాములు, బండి కొమరయ్య, పుష్పాల చందర్‌రావు, గ్రామకమిటీ అధ్యక్షుడు పుష్పాల హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలి

దమ్మపేట: మండల కేంద్రం, దమ్మపేట గ్రామ పరిధిలోని మల్లారం కాలనీలో ప్రత్యేకంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలని కోరుతూ.. సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మల్లారం కాలనీలో గృహ విద్యుత్ సరఫరాలో లోవోల్టేజ్ వల్ల టీవీ, ఫ్యాన్, ఫ్రిజ్, మిక్సీ, గ్రైండర్ తదితర గృహోపకరణాలు కాలిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై పలుమార్లు సంబంధిత అధికారులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందన్నారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే స్పందించి తక్షణమే ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు వీరబాబు, రాఘవులు, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాల వారోత్సవాలు

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణం మెడికల్ కాలనీ, వెంకటేశ్వర కాలనీ, ఈశ్వరమ్మ గుట్టలలోని అంగన్‌వాడీ సెంటర్లలో సోమవారం తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ అనసూయ మాట్లాడుతూ.. నవజాత శిశువులకు తల్లిపాలే శ్రేష్టమని, ఆరు నెలల వరకు తల్లిపాలే పట్టించాలని సూచించారు. పుట్టిన గంటలోపే బిడ్డకు తల్లి ముర్రుపాలు పట్టించడం కీలకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం బాలనాగమ్మ, మానస, విజయలక్ష్మి, రాజేశ్వరి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌అండ్‌బీ వర్క్ ఇన్‌స్పెక్టర్ బదిలీ

అశ్వాపురం: ఆర్‌అండ్‌బీ శాఖలో విధులు నిర్వహిస్తున్న వర్క్ ఇన్‌స్పెక్టర్లు, గ్యాంగ్ మజ్దూర్లు బదిలీ అయ్యారు. అశ్వాపురంలో ఎన్నో ఏళ్లు వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న కృష్ణను మణుగూరు, ఆళ్లపల్లి సెక్షన్లకు, మణుగూరు వర్క్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు అశ్వాపురానికి బదిలీ అయ్యారు. గ్యాంగ్ మజ్దూర్‌లుగా పని చేస్తున్న అమృతరావు, బి.కృష్ణ జీఎస్‌ఎంఎం, ఏడూళ్లబయ్యారం రోడ్డు అశ్వాపురం సెక్షన్‌కు బదిలీ అయ్యారు.

బీఆర్ఎస్ ఎస్సీ, బీసీ సెల్ అధ్యక్షుల నియామకం

అశ్వాపురం: బీఆర్ఎస్ పార్టీ ఎస్సీ, బీసీ సెల్ మండల అధ్యక్షులను మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు సోమవారం నియమించారు. బీసీ సెల్ మండల అధ్యక్షుడిగా భాగవతపు సతీష్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడిగా చల్లా రాజేష్‌ను నియమించారు. మండలంలో బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని వారు తెలిపారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో శిక్షణ


పాఠశాలలో వెయిట్ లిఫ్టింగ్ సాధన చేస్తున్న విద్యార్థులు

దుమ్ముగూడెం: మండల కేంద్రం దుమ్ముగూడెం గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పీడీ చైతన్య పర్యవేక్షణలో వెయిట్ లిఫ్టింగ్‌లో శిక్షణ ఇస్తున్నారు. డిస్ట్రిక్ట్ యూత్ స్పోర్ట్స్ ఆఫర్ ద్వారా, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీ నరేష్ కృషితో వెయిట్ లిఫ్టింగ్ పరికరాలు స్కూల్‌లో ఏర్పాటు చేశారు. దీంతో విద్యార్థులకు తగిన శిక్షణ ఇస్తున్నారు.

ఆశ్రమ పాఠశాలలో వైద్య శిబిరం


విద్యార్థినులకు పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి రాందాస్ నాయక్

అశ్వారావుపేటరూరల్: పట్టణంలోని అటెండర్స్ కాలనీలో ఉన్న ప్రభుత్వ గిరిజన బాలికల ఉన్నత ఆశ్రమ పాఠశాలలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సోమవారం 'సాక్షి' దినపత్రికలో 'పని చేయని ఆర్వో ప్లాంట్' శీర్షికన ప్రచురితమైన కథనంలో ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నట్లు వెలుగులోకి తీసుకురాగా.. స్థానిక వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు స్పందించారు. వినాయకపురం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రాందాస్ నాయక్ ఆధ్వర్యంలో విదార్థినులకు వైద్య పరీక్షలు చేయగా, ఇద్దరు జ్వరాలతో బాధ పడుతున్నట్లు గుర్తించి మలేరియా, డెంగ్యూ పరీక్షలు చేశారు. అలాగే జలుబు, దగ్గుతోపాటు ఆరోగ్య సమస్యలతో బాధ పడుతున్న వారికి వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం భావుసింగ్, హెల్త్ అసిస్టెంట్ ప్రసాద్, ఏఎన్ఎం అరుణ, ఆరోగ్య మిత్ర మల్లిక, ఆశ కార్యకర్త భారతి పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన సెర్ప్ ఏపీఎంలు

దుమ్ముగూడెం: మండల సెర్ప్ ఏపీఎంగా జూపల్లి జగదీష్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ప్రభుత్వం చేపట్టిన సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడ విధులు నిర్వహించిన హేమంతిని బూర్గంపహాడ్ మండలానికి బదిలీ కాగా.. జగదీష్ బదిలీపై ఇక్కడకు వచ్చారు. బాధ్యతలు చేపట్టిన ఏపీఎంను సీసీలు కృష్ణ, రమణకిషోర్, నరసింహారావు, ప్రేమ్ కుమార్, కోటేశ్వరరావు, రాము పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియచేశారు.

భద్రాచలంటౌన్: భద్రాచలం గ్రామీణ పేదరిక నిర్మూలనా సంస్థ (సెర్ప్) ఏపీఎంగా కరియావుల త్రిగుణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కరకగూడెంలో మండలంలో ఏపీఎంగా విధులు నిర్వహిస్తున్న త్రిగుణ సాధారణ బదిలీలలో భాగంగా భద్రాచలంకు వచ్చారు. కొత్తగా బాధ్యలు చేపట్టిన త్రిగుణకు సెర్ప్ సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.


10న మహాగర్జన సభ

పినపాక: ఈ నెల 10న పినపాకలో నిర్వహించనున్న దివ్యాంగుల మహాగర్జన సభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ రవి మాదిగ పిలుపునిచ్చారు. ఏడూళ్లబయ్యారం అడ్డరోడ్డులో జిల్లా నాయకుడు వల్లెపోగు వెంకటేశ్వర్లు అధ్యక్షతన సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దివ్యాంగులు అధికసంఖ్యలో హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో కృష్ణ, కొండయ్య, తిరుపతి, లాలయ్య పాల్గొన్నారు.

రామాలయానికి విరాళం

చండ్రుగొండ: మండలంలోని తిప్పనపల్లి గ్రామంలో నిర్మాణంలో ఉన్న రామాలయానికి లయన్స్‌క్లబ్ సభ్యుడు కోనేరు పూర్ణచందర్‌రావు ఆధ్వర్యంలో ఆర్‌కే సూపర్‌మార్కెట్ అధినేత అశోక్‌రాతి రూ.51 వేలు విరాళంగా సోమవారం అందించారు. కార్యక్రమంలో ఆలయ బాధ్యులు లంకా నర్సింహారావు, గాదె లింగయ్య, మచ్చా కుమార్, కొల్లం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

క్రీడాకారుడికి బంగారు పతకాలు


బంగారు పతకాలు సాధించిన శంకర్‌రావు

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని సిటీ స్టైల్ జిమ్ క్రీడాకారుడు డీవీ శంకర్‌రావు నాలుగు బంగారు పతకాలు సాధించిన్నట్లు జిమ్ కోచ్ జీవీ రామిరెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 2వ తేదీ నుంచి ఆగస్టు 7 వరకు కేరళలో నిర్వహిస్తున్న జాతీయస్థాయి మాస్టర్స్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో శంకర్‌రావు రాష్ట్రస్థాయిలో బంగారు పతకాలు సాధించడమే కాకుండా జాతీయస్థాయిలో 83 కిలోల విభాగంలో నాలుగు బంగారు పతకాలు సాధించిన్నట్లు పేర్కొన్నారు. స్క్వాట్స్ విభాగంలో 60 కిలోల బరువెత్తి బంగారు పతకం, బెంచ్ ప్రెస్ విభాగంలో 60 కిలోల బరువు ఎత్తి బంగారు పతకం, డెడలిఫ్ట్ విభాగంలో 100 కిలోల బరువెత్తి బంగారు పతకం సాధించిన్నట్లు వివరించారు. ఈ మూడు కలిపి 220 కిలోల బరువు ఎత్తి మరో బంగారు పతకం రావడం చేత తెలంగాణ రాష్ట్రానికి నాలుగు బంగారు పతకాలు కైవసం చేసుకున్నట్లు తెలిపారు. 73 ఏళ్ల వయస్సులో శంకర్‌రావు బంగారు పతకాలు సాధించడంతో పట్టణంలోని ప్రముఖులు, క్రీడాకారులు, కీడాభిమానులు అభినందనలు తెలిపారు.